# ఆశ

"ఆన్నేవుండు... బైటనే... లోపలికి రాగాకు.."

ప్రహారిగేటు మూసి ఇంట్లోకి అడుగేయబోతున్నంతలో లోపల్నించి ప్రమీల గొంతు విన్పించి ఒక్కసారిగా ఆగిపోయాడు కిరీటి.

కళ్లెత్తి దొడ్డి వాకిలి దాకా ఇంట్లోకి చూశాడు.

పెద్ద చెంబొకటి చేత బట్టుకొని పరుగెత్తినట్లుగా దొడ్లోకెళ్లింది ఆమె. చెంబునిండా నీళ్లతో గునగున నడుస్తూ బైటకొచ్చింది. ప్రహరి గేటుమీద చెంబునుంచి "కాళ్లు మొగం కడుక్కొని లోపలికిరా.." చెప్పింది.

అతని కళ్లనిండా ఆశ్చర్యం.

తనేమీ దివసానికి వెళ్లిరాలేదు గదా!

దాయాదులెవరైనా చస్తే వాళ్ల పెద్దకర్మకు వెళ్లి రేవులో అంటు బాపుకొని వచ్చినప్పుడు మాత్రమే చేసే యీ సాంప్రదాయిక కృత్యం ఇప్పుడెందుకు మొదలెట్టినట్లు?

"యేందే తిక్కదానా! దేవరమూల మంచిదీపం కూడా వెలిగించినావా యేందే?" అన్నాడు చెంబు అందుకొంటూ

"అవ్‌గదూ! మర్చేపోయినా.." గిరుక్కున వెనుదిరిగింది ఆమె.

"ఓసినీ అమాయికత్వం దొంగల్దోయా! నా వొళ్లు మీదన్నా సూడే.." అన్నాడు ఆమెకేసి అదోలా చూస్తూ. "దినానికి పోతే మీ పుట్టింటోల్లు తెచ్చిన కొత్తపంచె కొత్త తువ్వాలు ధరించి వస్తాగదా! ఒంటిమీద పట్టుబట్టలు ధగధగలాడిపోతాయి గదే!"

చివరగా అతను వదలిన వ్యంగ్యాస్త్రం చురుక్కుమనిపించింది ఆమెకు.

వెనక్కి తిరిగి "దినపు గుడ్డల భయంతోనే మీ గుంపుకు పిల్లనిచ్చేందుగ్గూడా ఎవురూ ముందుకు రారు. నెలకొకరు సచ్చి దినాల్జేసుకుంటాంటే పట్టు పంచెలు తీసకరావాల్నంట పిల్లోనికి.. పట్టుపంచెలు.." వెటకారంగా అంటూ లోనికెళ్లింది.

చిన్నగా నవ్వుకొంటూ పాదాల మీద నీళ్లొంచుకొన్నాడు కిరీటి.

పల్లె అంతా తమ దాయాది వర్గమే. ఏడాదికి నలుగురైదుగురన్నా రాలిపోతుంటారు. ప్రతిసారీ దివసానికి ఖరీదైన పంచె తువ్వాలు తీసుకు రావాలంటే-పిల్లనిచ్చిన వాళ్లు అంతంత మాత్రపు వాళ్లయితే యిదో యిట్లా తిట్టుకోవలసిందే.

చెంబు బైటే వుంచి లోపలికి నడిచాడు.

చేతిలో బ్యాగ్‌ను టేబుల్ మీద పడేసి చొక్కా గుండీలు విప్పుతోంటే.. "యీడగాదు యిప్పేది. దొడ్లేకి పా..దొడ్లేకి.." ఆదుర్దాగా చెప్పింది ఆమె.

నొసలు ముడేసి చూశాడు కిరీటి.

'కర్మ' రోజు కూడా ఎరుగని కొత్త మలుపు ఇది.

"గుడ్డలు జాలాట్లో పెట్టినా. నీల్లు కాచిపోసినా అన్నే యిడ్సుపో.. నీల్లదీసి ఆరేస్నా.." చెప్పింది.

"పొద్దున్నే గదే తొడిగింది. మాయలేదులే.." ఆమె ప్రతిపాదనను తిరస్కరించేందుకు ప్రయత్నించబోయాడు.

"అయిపుట్నోళ్లతో కలిసి తిరిగినవు. వాళ్ల పక్కన యీల్లపక్కన రాసుకొని పూసుకొని కూకున్నెవు. ఏ పెద్ద రోగాలు అంటుకొన్నెయో!.. నువ్వు జాలాట్లేకి పో".. నెట్టినంత పన్జేసింది.

ఆమె ప్రవర్తనకు కోణం సూచాయగా అర్థమైంది కిరీటికి.

మరేమీ మాట్లాడకుండా దొడ్లోకి నడిచాడు.

బట్టలు విప్పి తీగమీదేసి, నడుముకు తుండుగుడ్డ చుట్టుకొని జాలాట్లోకి దూరాడు.

బక్కెట్లో చెంబు ముంచేటపుడే వేడినీళ్ల జోరు అర్థమైందిగాని, మనసు పెళ్లాం చేష్టలమీదుండటంతో గబుక్కున మీద పోసుకొని ఒళ్లు చుర్రు మనటంతో ఎగిరి పడ్డాడు.

ఎసరులాగా కాగివున్నాయి నీళ్లు.

"ఏమే!" అంటూ గట్టిగా అరిచాడు.

"యీన్నేవుండా!" ఏమాత్రం ఉలికిపాటు లేకుండా ద్వారబంధానికి చేతులాన్చి చెప్పింది.

"యీ నీళ్లేందే!.. వీటి బదులు నన్నే పొయ్యిమీద ఉడకబెట్టక పోయినవూ!.. నియ్యమ్మ కడుపుగాల సన్నీళ్లు తీసకరాయే.."

"ఉడకబెడ్తేనే మంచిదెంట." చెప్పింది "ఎయిడ్సు రోగమొచ్చినాయప్ప పక్కన కూకున్నేవు అందుకే వేపాకులేసి మరగ్గాంచిపెట్టినా. యీ నీల్లతో వొళ్లు కడుక్కొంటేగాని అంటుపోదు." చెబుతూ లోనికి నడిచింది. "వొంగు.. వొంగరాదూ!" అంటూ దబాయింపుగా మెడమీద చెయ్యేసి ఒంగోబెట్టింది. ఏమాత్రం కనికరం లేకుండా చెంబుతో నీళ్లు ముంచి వీపుమీద పోసింది.

కెవ్వుమని కేకేశాడు కిరీటి.

వీపంతా పొగలు సెగలుగా వుంది.

ఎదిరించి విదిలించేందుకు ఎయిడ్స్ భయమొకటి అతని మనస్సులోనూ వుంది.

"పక్కనే కూకొని ఒకటే యికయికలు పకపకలంట. బుద్ధిలేకపోతే సరి.. మల్లా కుయ్యోమని అరుపు.. ఉడుకు నీల్లు పొయ్యడం కాదు.. సలాకు కాల్చి వాతలు బెట్టాల - గుర్తుండేట్టు.." చెంబుతో నీళ్లు కుమ్మరిస్తూ అంది.

పళ్ల బిగువున మంటను భరిస్తున్నాడు కిరీటి.

"సంపితివిగదే రాకాసీ.." అంటూ వాపోతున్నాడు.

అతని అరుపుల్ని ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రమీల.

"హోటల్ రంగమ్మ జేసినట్టు సేస్తేగాని నీ తిక్క కుదర్దు.." అంటూ మొగుని ఒళ్లంతా ఎర్రగా కందేలా ఉడుకు నీళ్లతో రుద్దిగాని వదల్లేదు ఆమె.

బండమీద ఉతికి ఆరేసినట్లుంది అతని శరీరం.

వేడి వేడి కాఫీ అందించి, ఫ్యాన్ వేసి, టివిపెట్టి, ఎదురుగా కూచుని అతనికేసి తదేకంగా చూడసాగింది ఆమె.

కాఫీతాగి మంచమ్మీద వాలగానే నిద్రబట్టింది కిరీటికి.

రాత్రి ఏడుగంటలగ్గానీ మెలకువ రాలేదు.

కడుపునిండా తినగానే మళ్లీ మూతలు పడ్డాయి.

'ఒళ్లు మండితే మండింది. సుఖమైన నిద్ర' అనుకొన్నాడు.

మరుసటి రోజు ఉదయం పదిగంటల ప్రాంతంలో ఆఫీసుకు బైల్దేరుతూ వుంటే మొగునికి చాలా జాగ్రత్తలు చెప్పింది ప్రమీల.

చెంబులు గ్లాసుల్ని పెద్ద దబరాలో పడేసి మరగకాచి స్టెరిలైజ్ చేసిందట హోటల్ రంగమ్మ. ఈరోజు ఎయిడ్స్ రోగితో రాసుకొని పూసుకొని తిరిగినాడని తెలిస్తే తనుకూడా అతన్ని అలాగే చేస్తానని మొగున్ని బెదిరించి వదలింది. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని అతను చెప్పబోతున్నా విన్పించుకోలేదు. ఈ విషయంలో వీధి ఆడాళ్లే అతనికంటే తెలివైన వాళ్లుగా తీర్మానించింది.

టీచర్‌గా వున్నా బావుండేది. రోజూ బడికి పోతూవుంటే యీ బాధలన్నీ వుండేవికావు. ఎమ్మెల్వోగా డెప్యుటేట్ అయింతర్వాత రకరకాల ప్రభుత్వ కార్యక్రమాల్ని భుజాన మోయాల్సి వస్తోంది.

కొత్తగా యిదో..యీ 'ఆశ' ఒకటి.

ఎయిడ్స్ రోగాన్ని గురించి ప్రజల్ని జాగృతం చేయాలిట. ఎయిడ్స్ అంటువ్యాధికాదనీ, ఎయిడ్స్ రోగిని అంటరానివాడిగా చూడకుండా ప్రేమాభిమానాలతో ఆదరంగా దగ్గరకు తీసుకోవాలనీ జనాలకు తెలియజెప్పాలిట.

ప్రతి గ్రామంలో సభ జరపటం.. పోస్టర్స్ ద్వారా, కరపత్రాల ద్వారా, ఉపన్యాసాల ద్వారా ఎయిడ్స్ గురించి ప్రచారం చేయటం. హోటల్ వద్దకెళ్లేసరికి భార్యమాటలు గుర్తొచ్చాయి.

తలొంచి కొట్టంలోకి దూరగానే ఎదురుగా నవ్వుతూ రంగమ్మ.

"ఏంసారూ! యియ్యాల కూడా అన్నానికొస్తరా?" అడిగింది.

"రాకుంటే ఎట్లా? ఏ పాటు దప్పినా సాపాటు దప్పదు గదా!"

"ఆయప్ప గూడా వస్తాదా?"

"ఎవురు?"

"ఎయిడ్సాయప్ప.."

"అతనికి ఆకలి కాదనుకొన్నెవా యేంది?" నవ్వాడు.

"మీకు నవ్వులాటగా వుంటది - మాకిక్కడ పానంబోతువుంటే.." ఆమె స్వరం మారింది. "మేమేం హోటల్ నడుపుకోవాల్నా వొద్దా?" అరిచినట్లుగా అంది. "వొచ్చినాయప్ప ఏదొక మూలన కూకొని తినిపోయింటే ఎవురికీ తెలవకుండు. అందరి నడుమన దర్జాగా కూకుండె.. లోటా నోటిగ్గరింపించుకొని నీల్లుదాగె.. బానలో చెంబుముంచె ఎయిడ్సు రోగని అందరికీ తెల్సిపాయే.. నా హోటలుకు మనుసులెట్లా వస్తారు సారూ? హోటలు మూసుకోమంటారా యేంది?.. మీరేమన్నా అనుకోండి. ఇయ్యాల అయ్యప్ప వొస్తే లోపలికి రానియ్యను ఎంటబెట్టుకొనొస్తే మీ పరువే పొయ్యేది.. పార్సల్ కట్టిస్తా. మీ ఆఫీసులో తినబెట్టుకోండి.." చెప్పింది.

నవ్వాగింది కాదు అతనికి.

ఆమె వాలకం చూస్తోంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఎయిడ్స్ రోగిని హోటల్‌లోకి అడుగు పెట్టనిచ్చేట్టు లేదు.

ఆమె చెప్పినట్లు నడచుకోక తప్పదు.

పేరుకు మండల హెడ్ క్వార్టరే అయినా - యీ పల్లెలో బైటివాళ్లకు పిడికెడు మెతుకులు దొరికేది యీ రంగమ్మ హోటల్‌లోనే.

నేరుగా మండల పరిషత్ ఆఫీసు వద్ద కెళ్లాడు.

'ఆశ' బ్యానర్‌తో సింగారించుకొన్న జీపు అక్కడ సిద్ధంగా వుంది.

ఎయిడ్స్ రోగి ఆనంద్ జీపువద్ద ఒంటరిగా తచ్చాడుతున్నాడు.

కిరీటిని చూడగానే విష్ చేశాడు.

చిరునవ్వుతో ప్రతిస్పందిస్తూ ఆఫీసులోకి వెళ్లాడు కిరీటి.

డాక్టర్ వగైరాలు ఎండీవో గదిలో కూచుని వున్నారు.

లోపలికి వెళ్లి రంగమ్మ చెంబులు, గ్లాసుల సంగతి చెప్పాడు.

వచ్చే నవ్వుని ఆపుకొనేందుకు కొంత అవస్థ పడ్డాడు ఎండిఓ

డాక్టర్ మాత్రం మొహం నిండా సీరియస్‌నెస్ పులుముకొని "ఏం చేద్దామండీ! జనాల్లో ఇంకా అవేర్‌నెస్ రాలేదు. ఎయిడ్స్ మహమ్మారే. కాదనం. కానీ.. అది అంటువ్యాధి కాదనే విషయం వాళ్ల మెదడులోకి ఎక్కాలిగదా!" అన్నాడు.

"ఎక్కించండి.." చెప్పాడు ఎండివో. "ఈ నెలరోజులూ మీరు ఆ ప్రయత్నం మీదే ఉంటారు గదా!" అన్నాడు.

కిసుక్కున నవ్వు విన్పించి వెనుదిరిగి చూసేసరికి అటెండర్ తిమ్మయ్య కన్పించాడు కిరీటికి.

"తిమ్మయ్యా! రేత్రికి రంగమ్మ హోటల్‌లో భోజనం పార్శిల్ కట్టించకరా.." చెప్పాడు.

"ఎవురికి సార్!"

"మాతోబాటు జీపులో వస్తాడు గదా – ఆనంద్ అనీ.."

"ఎవురు? ఎయిడ్సాయప్పా?"

"ఆ.."

"హోటల్లో ఏమంట?"

"రంగమ్మ బయపడ్తాందిలే.."

"ఆఫీసులో మాత్రం యాడతింటాడబ్బా!" తల గోక్కున్నాడు.

"ఏమీ?" ప్రశ్నార్థకంగా చూశాడు ఎండీవో.

"ఏమంటే ఏంజెప్పాల సారూ! 'నాకు రోగముందే – నేను కుదురుగా వొకసోట వుండాల్నే' అనుకోడు సార్ ఆయప్ప. నిన్న నేరుగా బానకాడికి పోయి లోటా తీసి ముంచి నోటిగ్గరిపించుకొని తాగె. మంచోళ్లే నోటిగ్గరిపించుకోరు. యాడ తట్టు కొంటావూ? మనోళ్లు సూడలేకపోయిరి. లోటాలన్నీ గోడవతల పారేసొచ్చిండు, సామేలు.. రోగమున్నోడు రోగమున్నెట్టుండాల సారూ! అడిగితే ప్లాస్టిక్ లోటాతోనో, ఏదొకదాంతో నీళ్లియ్యమూ.. దప్పికతో సంపుతామా!.. ఆఫీసులో తినొద్దు ఏమొద్దులే సార్!" చెప్పాడు.

"వద్దంటే ఎట్లా?" ఎండీవో అన్నాడు.

"అయితే.. డ్వాక్రా బిల్డింగ్ లేకి తీసపోయి పెడ్తాంలే. ఎట్లా అది ఖాళీగా వుంది."

అటెండర్ ప్రతిపాదనను ఎవరూ సవరించలేదు.

సమయమవటంతో అందరూ జీపువద్దకు కదిలారు.

డ్రైవరు పక్కసీట్లో ఎండీవో కూచున్నాడు.

మధ్య సీటులో డాక్టర్, ఎమ్మార్వో తోటి కిరీటి కూచొని వున్నా ఇంకొకరికి తావుంది.

అప్పటిదాకా పక్కపక్కనే తచ్చాడుతూ వున్న ఆనంద్ జీపు వద్దకొచ్చాడు.

కిరీటి పక్కన తావు కనబడటంతో దగ్గరగా వెళ్లి ఆశగా చూశాడు.

జరగబోయే ప్రమాదమేమిటో వెంటనే అర్థమైంది కిరీటికి.

భార్య హెచ్చరిక జ్ఞాపకమొచ్చింది.

ఆఫీసులోంచి బైటకొస్తూవున్న ఎమ్మార్పీ కన్పించగానే "సార్ వస్తాండు.. నువ్వెనక్కి పో.." అని ఆనంద్‌కు చెప్పి, ఎమ్మార్పిని పిల్చి మరీ తన పక్కన కూచోబెట్టుకొని సీటుకు చేరగిలబడి గట్టిగా వూపిరిపీల్చుకొన్నాడు - గండం గడచినట్లుగా అనుభూతిస్తూ.

జీపు ఆఫీసు దాటింది. రోడ్డంతా ఎగుడు దిగుడులుగా వుండటంతో, జీపు కుదుపులకు ఒకరిమీదొకరు పడుతున్నారు.

ఓరగంట వెనక్కి చూశాడు కిరీటి.

ఆనంద్ పక్కనున్న హెల్త్ అసిస్టెంట్ ఆవస్థ గమనించేసరికి నవ్వొచ్చింది. ఎయిడ్స్ రోగి తన్నంటకుండా వొదిగి వొదిగి కూచుంటున్నాడు అతను. లోలోపల కుదించుకుపోతున్నాడు. మనిషంతా కర్రలాగా బిగదీసుకుపోయి ఓ మూలకు అంటుకుపోవాలని ప్రయత్నిస్తున్నాడు. ఎంతో వేదన అనుభవిస్తున్నాడు.

'హెల్త్ డిపార్ట్‌మెంట్ వాళ్ల పరిస్థితే అట్లా వుంటే, ప్రమీల లాంటి వాళ్లను తప్పుబట్టాల్సిన పన్లేదనుకొన్నాడు కిరీటి.

తనను బానలో కూచోబెట్టి మరగకాస్తనన్న మాటలు గుర్తొచ్చాయి.

రంగమ్మ చేసిన పని తెలిసి ఆమె అట్లా అంది.

ఆఫీసులో సాయేలు గ్లాసులు పారేసిన సంగతి తెలిసుంటే ఏమనేదో?

నవ్వొచ్చింది.

చాలాసేపు లోలోపల నవ్వుకొంటూ వుండిపోయాడు.

అంతలో వెనకనించి అరుపు.

హెల్త్ అసిస్టెంట్ హిస్టీరిక్‌గా కేకలేస్తున్నాడు.

"నేనెంతకూ సర్దుకొని సర్దుకొని వొదుక్కొంటావుంటే నువ్వింకా మీంద మీంద కొస్తావే! చేతివేలుకు గాయమైంది. దూరంగా వుండాలని ఎంత ప్రయత్నించినా అర్థం చేసుకోవేం? విశ్రాంతిగా కూచున్నావు. దొరలాగా కూచో. మనిషి కూచుంటే గాని నీకు కూచున్నట్టుండదా!" లేచి నిల్చుని అరుస్తున్నాడు.

డాక్టర్ వెనక్కి తిరిగాడు.

"గంగారావ్! కూల్‌డౌన్... జస్ట్ ఫైవ్ మినిట్స్ యా.. రిటర్న్ జర్నీలో నీప్లేస్‌లోకి నేనొస్తాను. సరేనా.." చెప్పటంతో పరిస్థితి సద్దుమణిగింది.

పల్లెలో జీపు దిగగానే హెల్త్ అసిస్టెంట్‌ను దగ్గరకు పిల్చుకొని చెప్పాడు డాక్టర్ "ఓపిక పట్టాలమ్మా!" అని.

"అందరట్లా గాయాల్లేకంటే నేనూ పట్టించుకోను సార్! చూడండి.. వేలికి గాయమైంది. అతనిగ్గూడా పుండ్లలాంటివి వుంటే.. రెండూ టచ్‌అవుతే..సార్!"

"నాకు తెలుసమ్మా!" చెప్పాడు డాక్టర్. ఐనో ఎవ్విరీథింగ్. బట్..హి యీజ్ ద మోస్ట్ ఇంపోర్టెంట్ పర్సన్.. ఫర్ దిస్ ప్రోగ్రాం.. అతను లేకుంటే ప్రోగ్రామే లేదు. మనం చెప్పేదంతా థియరీ. అతను ప్రాక్టికల్.. అండర్‌స్టాండ్!.. అతన్ని భరించాల్సిందే.. తప్పదు.." వాళ్ల బాధంతా తనే అనుభవిస్తున్నట్లుగా అభినయిస్తూ చెప్పాడు.

సచివాలయం వద్ద సభ ప్రారంభమైంది.

వేదికమీద వరసగా ఆసీనులయ్యారు అధికారులంతా.

మొదటిరోజు అనుభవం గుర్తుంది కాబట్టి తన జాగ్రత్తలో తనున్నాడు కిరీటి.

తన పక్కన పంచాయితీ సర్పంచ్‌ను కూచోబెట్టుకొన్నాడు. తర్వాత సీటును ఆనంద్ వచ్చి ఆక్రమించుకొన్నాడు.

రోజుటిలాగే ప్రసంగాలు సాగుతున్నాయి. ఎయిడ్స్ వ్యాధికి మందు లేదనీ, అది అంటకుండా చూసుకోవటమే ముఖ్యమనీ, అలాగని అది అంటువ్యాధి కాదనీ, ఎయిడ్స్ రోగిని అంటరానివాడిగా చూడకూడదనీ, మానవతా దృక్పథంతో దగ్గరకు తీసికొని ప్రేమాభిమానాలు చూపటం వలన అతని ఆయుష్షును పెంచవచ్చనీ..

చివరిగా ఎయిడ్స్ రోగిని పరిచయం చేసేసరికి అక్కడున్న జనాలందరి కళ్లల్లో ఆశ్చర్యం.. వింతదనం.

తన పక్కనున్న ప్రెసిడెంటుకేసి చూశాడు కిరీటి.

అప్పటికే కుర్చీలో ముడుచుకుపోయి వున్నాడు అతను. లెవెన్ కె.వి. విద్యుత్ తీగల పక్కన కూచున్నంత భయంతో కుంచించుకపోతున్నాడు.

మొన్న తన పరిస్థితీ అంతే.

సమావేశానికి వెళ్లేదాకా ఆనంద్ అంటే ఎవరో తెలీదు. అతను తన పక్కనే కూచున్నాడు. రెండు మాటల్లోనే పరిచయం చేసికొని తనకేసి వంగివంగి గుసగుస లాడాడు మాటల్లో తప్ప చేతల్లో చిత్తశుద్ధి చూపించలేని అధికారుల్ని గురించి కామెంట్ చేశాడు. తను పాజిటివ్‌గా స్పందించటంతో మరీ దగ్గరయ్యాడు. అతనెవరో తెలిసిన తర్వాత తనకు ఒళ్లంతా గొంగలి పురుగులు పాకినంత అసహ్యపు జలదరింపు. అతని స్పర్శ సోకిన తన శరీరభాగాలన్నీ తనకు పరాయివయినంతగా అనుభూతి.

ప్రమీల మంచి పనే చేసిందేమో!

కిరీటి ఆలోచనల్లో వుండగానే ఆనంద్ మాట్లాడేందుకు లేచాడు.

తనకు ఎయిడ్స్ ఎలా వచ్చిందో చెప్పుకొచ్చాడు.

రక్త మార్పిడి వల్ల జబ్బు అంటుకుందిట.

"రక్తమార్పిడా యానిపిండాకూడా! యాన్నో కొంపల్లో దూరి తెచ్చుకోనుంటాడు." సర్పంచ్ అన్నాడు కిరీటికేసి చూస్తూ. "వీడు మల్లా వొచ్చి నాపక్కన కూకుంటాడేమో!" అంటూ లేచి వేదిక దిగిపోయాడు.

రాబోయే ప్రమాదం కిరీటికి అర్థమైంది. తర్వాతి సీటు తనదే. ప్రసంగం తర్వాత ఆనంద్ నేరుగా వచ్చి తన పక్కనే కూచోగలడు.

"సార్! నిరంతర విద్యాకేంద్రం దాకా వెళ్లొస్తా.." ఎండీవోకు చెప్పి, సమాధానం కోసం ఎదురుచూడకుండా వేదిక దిగాడు.

పెద్ద గండం గడచినట్లుగా ఫీలవుతూ జనాల్లో వున్న ప్రేరక్‌ను వెదకి పట్టుకొని మరీ మాటలు కలిపాడు.

ఆనంద్ ఇంకా మాట్లాడుతున్నాడు. సమాజం తనను చిన్న చూపు చూడటం పట్లా, తనను దూరంగా వుంచేందుకు ప్రయత్నించటం పట్లా ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం వారు నిర్వహిస్తోన్న యీ 'ఆశ' కార్యక్రమం వల్లనయినా జనాల్లో మార్పు వచ్చి తన లాంటి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపట్ల మానవతా దృక్పథం అలవడు తుందేమోనని ఆశ కలుగుతోందని అన్నాడు.

అతను ప్రసంగం ముగించబోతున్నాడనే విషయం అర్థమయ్యేసరికి స్టేజిమీది తర్వాత వ్యక్తి హెల్త్ సూపర్ వైజర్ ఏదో పనున్నట్లుగా స్టేజి దిగిరావటం కిరీటి కళ్లబడి నవ్వుకొన్నాడు.

తర్వాత కొంత సమయానికి సభ ముగిసింది.

అక్కడి జనాలంతా ఆనంద్‌కేసి వింతగా చూస్తున్నారు.

దూరంగా తొలగి దారిస్తూ నిశితంగా పరిశీలిస్తున్నారు.

వాళ్ల చూపులు అతనికి అర్థమయ్యాయి కాబోలు మొహమంతా చిన్నబుచ్చుకొని మౌనంగా అడుగులేస్తున్నాడు.

అక్కడున్న అధికారుల్లో ఒక్కరైనా అతనికి సన్నిహితంగా వెళ్లి మాటలు కలపటం లేదు. అతను అంటరానివాడు కాదనే భావం జనాల్లో కలిగించటం లేదు.

మరో రెండు పంచాయితీ కేంద్రాల్లో సభలు నిర్వహించేసరికి సాయంత్రమైంది.

తిరుగు ప్రయాణంలో మధ్య వరస నిండేట్లుగా ముందే జాగ్రత్త పడ్డాడు డాక్టర్. హెల్త్ అసిస్టెంట్‌కు ఇచ్చిన మాట గుర్తులేనట్లే నటించాడు.

సాయంత్రం కిరీటి ఇంట్లో అడుగు పెట్టగానే వేడినీళ్ల వైద్యం చాలించలేదు ప్రమీల. ఆ కొద్దిసేపు మంటగానే వున్నా.. అరచి గెంతులేసినా.. తర్వాత దాని ప్రభావం వల్ల వచ్చే నిద్ర చాలా హాయిగా అన్పిస్తోంది అతనికి. పైగా ఎయిడ్స్ అనుమానం ఒకటి కడిగేసినట్లయి మానసిక ప్రశాంతత కూడా లభిస్తోంది గదా!

తమతోటి వచ్చే హెల్త్ అసిస్టెంట్ వగైరాలకు కూడా వేడినీళ్ల వైద్యం చెబితే బావుండుననిపించింది కిరీటికి. మర్లీ రోజు క్యాంప్‌లో ఆ పని చేద్దామనుకొన్నాడుగాని – ఆనంద్ మరో కొత్త సమస్యను సృష్టించటంతో తన వైద్యం సంగతి మరిచాడు.

తనను అంటరానివాడిగా చూస్తున్నారంటూ ఆఫీసు సిబ్బందిమీద ఎండీవోకు ఫిర్యాదు చేశాడు ఆనంద్. నీళ్ల గ్లాసులు ముట్టుకోనీడం లేదుట. హోటల్‌కు రానీటం లేదుట. ఆఫీసులో అన్నం తిననీటం లేదుట. పేపరు చూసేందుకు వెళ్లినా అసహనపడుతున్నారుట.

అతి ముఖ్యమైన విషయం – రాత్రిపూట ఆఫీసులో పడుకోనీటం లేదుట. డ్వాక్రా బిల్డింగ్‌లోకి తరుముతున్నారుట.

ఈ విషయాలన్నీ తననిక్కడికి పంపించిన స్వచ్ఛంద సంస్థకు తెలియజేస్తాననీ, తనలాగా మండలానికొకరు వంతున వచ్చిన ఎయిడ్స్ రోగులందర్నీ సంఘటితపరచి కలక్టరు వద్ద ఫిర్యాదు చేస్తామనీ అన్నాడు.

ఎండీవో గారు డాక్టర్ని తనగదిలోకి పిలిపించుకొన్నాడు. ఆనంద్ సమస్యను చర్చించాడు. రాత్రిపూట ఆఫీసులోకి రానివ్వకపోవటమనే విషయం వాళ్లక్కూడా నచ్చలేదు.

ఆనంద్ తోటి ఆఫీసు సిబ్బందిని పిలిపించాడు.

"రాత్రిపూట అతన్నిక్కడ పడుకోనియ్యవంట నిజమేనా?" వాచ్‌మెన్‌ని అడిగాడు.

"ఎవురొద్దన్నేరు సార్! పండుకోమను. నేనే డాక్రా బిల్డింగ్‌లేకిపోతా" సామేలు చెప్పాడు.

"అదే.. ఆ వివక్షే ఎందుకని నేనడుగుతున్నా!" ఆనంద్ అన్నాడు.

"పెద్ద రోగమొచ్చినోన్ని దూరంగా పెట్టక కావలించుకుంటారేమో!" బైట్నించి వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు అటెండర్ తిమ్మయ్య.

"నువ్వుంటే నాకు నిద్దర్రాదు." చెప్పాడు సామేలు.

"ఏం. నేను మనిసిని కాదా?" ఆనంద్ ఆక్రోశం.

"నేనే కాదేమో!"

"అతనుంటే నీకెందుకు నిద్దర్రాదు?" ఎండీవో ప్రశ్న.

"ఏమోసార్! తొలిరోజు తెల్లార్లు మేలుకొని యీయప్ప దిక్కే సూస్తాన్నె. రెప్పమూత బడింటే వొట్టుసార్! నాకు నిద్దర్రాలే.. దాక్రా బిల్డింగ్‌లేకి పోతాండా." అంటూ ఆనంద్‌కేసి తిరిగి "ఏం నువ్వొక్కడివి పండుకోలేవా? ఇంగో మాసిని కర్చుకొని పండుకొంటేగాని నీకు నిద్దర్రాదా?" కసిగా అన్నాడు పళ్లు బిగించి. బిరబిర పక్కగదిలోకి వెళ్లి 'ఆశ' కార్యక్రమం తాలూకు బుక్‌లెట్ తెచ్చి ఓ పేజీలోని బొమ్మను ఎండీవో టేబుల్ మీద డిస్‌ప్లే చేసి "యాడ పండుకొని నస్సావ్ సార్ - యీ బొమ్మే కండ్లముందు మెదల్తావుంటే..." అన్నాడు.

స్వలింగ సంపర్కానికి సంబంధించిన బొమ్మ అది.

టక్కున దాన్ని మూసేశాడు యండీవో.

అప్పటికే చూడదగిన వాళ్లంతా చూశారు.

తన్నుకొస్తోన్న నవ్వును బిగబట్టుకొనేందుకు తెగ అవస్థలు పడ్డారు.

ఆనంద్‌కు అర్థమైంది.

తలొంచుకొని మెల్లిగా బైటకు నడిచాడు.

లోపల ఇంకా చర్చలు సాగుతున్నాయి.

కిరీటి బైటకొచ్చి జీపుకేసి నడుస్తోంటే "సార్!" అంటూ ఆనంద్.

"చూడండి సార్!" పేపర్‌లో ఓ వార్తను ప్రత్యేకించి చూపించాడు.

తిరుపతి సమీపంలోని చంద్రగిరి వద్ద జరిగిన సంఘటన అది. ఎయిడ్స్‌రోగి ఒకడు రోగం ముదిరిన దశలో బంధువులు తెచ్చి హాస్పిటల్ ముందు పడేసిపోతే, ఒకటి రెండ్రోజులు చూసింతర్వాత హాస్పిటల్ సిబ్బంది అతన్ని తీసికెళ్లి స్మశానంలో పడేసి వచ్చిన సంఘటనకు సంబంధించిన కథనం అది.

హృదయాలను కదిలించే బాధామయ గాథే అది.

"ఎందుకు సార్ యీ కార్యక్రమాలన్నీ? సాటి మనిషిని మనిషిగా చూడలేని వాళ్లకు యీ సభలెందుకు? సమావేశాలెందుకు? ప్రాణం పోయాల్సిన హాస్పిటల్ వాళ్లే ఎంత పన్జేసినారో చూడండి. పల్లెజనాల్లో అవేర్‌నెస్ తీసకరావటం కాదు సార్! ముందు వాళ్లల్లో మార్పు రావాలి. నిజంగా యీ 'ఆశ' ప్రోగ్రాం ద్వారా ఏదో వొరగబెడ్తారని మేం ఆశపడినం సార్! ష్చ.." నిట్టూర్చాడు.

ఆనంద్ మాటలకు సమాధానం ఇవ్వలేని పరిస్థితి కిరీటిది.

ఈ లోపు ఎండీవో బైటకొచ్చాడు.

ఆనంద్‌ను పిల్చాడు.

"చూడూ.. మావాళ్లు నీతో సరిగ్గా బిహేవ్ చేయనందుకు నేను చింతిస్తున్నాను. అది వాళ్ల తప్పుకాదు. నీ తప్పుకాదు. వ్యాధి అట్లాంటిది. మనుషులందర్లో ఒక్కసారిగా మార్పురావాలంటే రాదు. ఆఫీసు ఉద్యోగులయినంత మాత్రాన వీళ్లందర్లో మార్పొచ్చిందనుకోవటం పొరబాటు. వీళ్లు కూడా అందరిలాంటి మనుషులే కదా! సరే.. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడేం చేద్దామంటావో చెప్పు." అడిగాడు.

"మీ వాళ్ళల్లో మార్పురాకుంటే నేనుండలేను సార్! జీపులో పక్కన కూచోకూడదు. హోటల్లో అందరితో కలిసి భోంచేయకూడదు. ఆఫీసు గ్లాసుతో నీళ్ళు తాగకూడదు. రాత్రిపూట దూరంగా మరో గదిలో పడుకోవాలి. మమ్మల్ని ఒంటరి వాళ్లను చెయ్యటానికి కాదు సార్ - మాలోని ఒంటరితనం పోగొట్టేందుకే యీ 'ఆశ' కార్యక్రమం.."

"ఒక్కసారిగా ఎక్కడా మార్పు రాదండీ!"

"మీ వాళ్లు మారేందుకు ఇష్టపడకపోతే నేను వెళ్లిపోతాను సార్!"

రెండు క్షణాలు ఆలోచించాడు ఎండీవో.

"సరే నీయిష్టం... అయితే ఓ పన్జేయి. నువ్వెళ్లిపో.. నువ్విక్కడ పన్జేసినట్టే అటెండెన్స్ వేస్తాం. అన్ని రోజులకు కలిపి నీకు రావలసిన డబ్బంతా నీకు పంపిస్తాం.. సరేనా?" చెప్పాడు.

అంగీకార సూచకంగా తలూపాడు ఆనంద్.

అందరికీ కొండంత బరువు దిగిపోయినట్లుగా అనిపించింది.

ఆరోజు ఎయిడ్స్ రోగి లేకుండానే ఎయిడ్స్ వ్యాధిపట్ల జనాల్ని జాగృతం చేసేందుకు పల్లెకేసి దూసుకెళ్లింది జీపు.

ఎయిడ్స్ రోగిని దూరంగా తరిమేసిన 'ఆశ' బృందం ఇప్పుడు నిశ్చింతగా వేదిక మీద కూచోగలిగింది. ఎయిడ్స్ రోగి స్పర్శ తమకు అంటదనే ధైర్యం వల్ల మరింత ఉత్సాహంగా ఉపన్యాసాలిచ్చారు వక్తలంతా - ఎయిడ్స్ అంటు వ్యాధి కాదనీ ఎయిడ్స్ రోగిని ఆత్మీయంగా దగ్గరకు తీసికోవాలనీ, ప్రేమాభిమానాలు పంచిపెట్టాలనీ, తమలో ఒకనిగా చూసుకోవాలనీ...

రోజూ ఎయిడ్స్ రోగి భయంతో గొంతు పెరిగేది కాదు. ఈ రోజు ఎంత ధారాళంగా, ఎంత ఉత్సాహంగా, ఎంత అభ్యుదయ పంథాలో సాగాయనీ ఉపన్యాసాలన్నీ, జనాలు కూడా శ్రద్ధగా విన్నట్లే అనిపించింది.

ప్రోగ్రాం మునుపెన్నడూ లేనంత గ్రాండ్ సక్సెస్‌గా అనుభూతించారు బృందమంతా.

ఎయిడ్స్‌రోగి జీపులో వెళ్లటం లేదని తెలిసి వేడి నీళ్ల వైద్యం చాలించింది ప్రమీల.

ఆరోజు రాత్రి నిద్రపట్టక తెల్లార్లూ పడకమీద పొర్లుతూనే వుండిపోయాడు కిరీటి.

నిద్రరాని కనుగుడ్ల నిండా పారాడే ఏవేవో కలలు.. స్మశానంలో ఎయిడ్స్ రోగిని తను చూసేందుకు వెళ్లినట్లూ.. అతను ఉన్నట్టుండి ఎగిరి వచ్చి తన మెడ కరచుకొన్నట్లూ.. హాస్పిటల్ వరకు మోసుకెళ్లి అక్కడ దించేదాకా వదలనట్టూ.. ఏవేవో కలలు...

తెల్లారు జామున మొగుడేదో పలవరిస్తోన్నట్లు విన్పించి దగ్గరగా వెళ్లింది ప్రమీల.

"ఉడుకునీల్లు పొయ్యి. ఎసురాల కాంచిపొయ్యి.. వొల్లంతా కందేట్లు రుద్దు.. ఉడుకునీల్లు.."

ఆశ్చర్యంతో ముక్కుమీద వేలేసుకొంది ఆమె.

● ఈనాడు ఆదివారం - 4 సెప్టెంబర్, 2005 ●